స్వచ్ఛతా హీ సేవలో భాగస్వాములవ్వండి

డిఎస్‌డిఒ బి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఏలూరు

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో అంతా భాగస్వాములు కావాలని డిఎస్‌డిఒ బి.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశాల మేరకు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని శ్రీనివాసరావు అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్, స్విమ్మింగ్, వాటర్ స్పోర్ట్స్, టేబుల్ టెన్నిస్, స్కేటింగ్, వెయిట్ లిఫ్టింగ్ విభాగాల్లో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. విజేతలకు అక్టోబరు 2న బహుమతులు అందిస్తారని చెప్పారు.

ప్రభుత్వ విధానాలతోనే.. సంక్షోభంలో వ్యవసాయం

రైతులకు గిట్టుబాటు ధర చట్టం అమలు చేయాలి
ఎపి రైతుసంఘం రాష్ట్రస్థాయి రైతు సదస్సులో వక్తలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, ద్వారకాతిరుమల

'వ్యవసాయాన్ని కాపాడండి.. రైతులను రక్షించండి, వ్యవసాయ సంక్షోభానికి ప్రభుత్వాల విధానాలే కారణం, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానాలు అవసరం' అని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం ద్వారకాతిరుమలలోని శ్రీ కృష్ణ యాదవ కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర రైతు సదస్సు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత రైతుసంఘం జెండాను సంఘం జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు ఆవిష్కరించారు. 'వ్యవసాయాన్ని కాపాడండి.. రైతును రక్షించండి' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ముఖ్యఅతిథుల్లో ఒకరైన వ్యవసాయ శాఖ మాజీ మంత్రి, ఎపి రైతుసంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడారు. రైతాంగం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర దక్కక రైతులు నష్టపోతున్నారన్నారు. గిట్టుబాటు ధరల చట్టం తీసుకురావడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. బడా కార్పొరేట్ కంపెనీలకు మోడీ ప్రభుత్వం గడిచిన ఐదేళ్లలో రూ.14 లక్షల కోట్లు బ్యాంకు రుణాలు మాఫీ చేసిందని, రైతులకు మాత్రం ఒక్క పైసా కూడా రుణమాఫీ చేయలేదని అన్నారు. రైతులంటే అంత చులకన భావం ఎందుకని ప్రశ్నించారు. రైతులకు రుణమాఫీ అమలు చేయాలని, కేంద్రంపై ఒత్తిడి తెచ్చే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. రైతులు ఆరుతడి పద్ధతులు పాటించడం వల్ల గ్లోబల్ వార్మింగ్ తగ్గించొచ్చని, దిగుబడులు సైతం వస్తాయని అన్నారు. చెరకు, వరి పంటలు కోసేసిన తర్వాత చెత్తను తగలబెట్టకుండా రోటవేటర్తో కల్టివేట్ చేస్తే సేంద్రియ ఎరువుగా మారి పంటలకు ఎంతో బలంగా మారుతుందన్నారు. భూసారం పెరిగి దిగుబడులు పెరుగుతాయని వివరించారు. జన్యు మార్పిడి పంటలను ప్రోత్సహించరాదని, అలాంటి పంటలను రైతులు వేయవద్దని చెప్పారు. కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు కల్పిస్తున్న మోడీ ప్రభుత్వం రైతుకు ఏ విధమైన రాయితీ కల్పించడం లేదన్నారు. రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ఇన్సూరెన్స్ కంపెనీలకు వరంగా మారిందన్నారు. అన్ని పంటలకూ బీమా కల్పించాలని, ఇన్‌పుట్ సబ్సిడీ ప్రతి రైతుకూ అందించాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న రైతు సంఘం సీనియర్ నేత వై.కేశవరావు

సూర్యనారాయణ



వడ్డే శోభనాద్రీశ్వరరావు

వ్యవసాయం చేసే రైతులు తగ్గడం ఆందోళనకరం

వ్యవసాయం చేసే రైతుల సంఖ్య రోజురోజుకీ తగ్గిపోతుండటం ఆందోళన కలిగిస్తుందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పూర్వ రాష్ట్ర కార్యదర్శి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. కౌలు రైతుల సంక్షేమాన్ని ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని విమర్శించారు. పంట రుణాలు, నష్టపరిహారాలు కౌలు రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. పాడి రైతులు తీవ్ర నష్టాల్లో ఉన్నారని, అమూల్ వంటి సంస్థలను తీసుకువచ్చి విజయ వంటి సహకార డెయిరీలను దెబ్బతీశారని విమర్శించారు. అన్ని పంటల రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలని కోరారు. ఎపి రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.కేశవరావు మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై దేశవ్యాప్త రైతు ఉద్యమం త్వరలో నిర్వహిస్తామన్నారు. రైతులకు మద్దతు ధర చట్టం చేయాలని, రుణ విమోచన చట్టం అమలు పరచాలని డిమాండ్ చేశారు. బోర్లకు విద్యుత్ మీటర్లను పెట్టే జిఒ22ను రద్దు చేయాలన్నారు. రైతాంగాన్ని చైతన్య పరచడానికి యువకులు, మహిళా రైతులు ఉద్యమంలోకి రావాలన్నారు. పండిన పంటకు 50 శాతం అదనపు ధర ఖర్చు లెక్కించి గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. పారిశ్రామికవేత్తలు వస్తువులకు నూరుశాతం లాభాలు పొందుతున్నారన్నారు. రైతులు మాత్రం తాము పండించిన పంటకు ధర నిర్ణయించలేకపోతున్నాడని చెప్పారు. రైతాంగ ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని, అందుకు రైతాంగం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో మొగతడకల శ్రీనివాసరావు, తూంపాటి సత్యనారాయణ మాట్లాడుతూ రైతులకు అంతా అండగా నిలబడాలని కోరారు. సదస్సుకు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ఆహ్వానం పలికారు. సంఘం రాష్ట్ర నాయకులు జొన్నా శివశంకరరావు, పివి.ఆంజనేయులు, కె.మోహనరావు, జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు మాట్లాడారు. చింతకాయల బాబురావు, ఆకుల హరేరాం, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి వచ్చిన రైతు సంఘం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటిలో ఆహారపు నాణ్యత పెంచాలి

మెస్ కాంట్రాక్టర్‌ను మార్చండి
ట్రిపుల్ ఐటి అధికారులకు మంత్రి కొలుసు పార్థసారధి ఆదేశం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ట్రిపుల్ ఐటీలో విద్యార్థులు చదువుకునేందుకు అనువైన మంచి వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ట్రిపుల్ ఐటీ అధికారులను ఆదేశించారు. ఇటీవల ట్రిపుల్ ఐటీలో ఆహార నాణ్యత, విద్యార్థుల అనారోగ్యం, విద్యార్థుల ఆందోళన తదితర పరిస్థితులపై స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఉదయం ట్రిపుల్ ఐటి అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ట్రిపుల్ ఐటీ విద్యాసంస్థలో ఇటువంటి సంఘటనలు చోటుచేసుకోవడం, తరచూ పునరావృతం కావడం బాధాకరమన్నారు. కొత్తగా వచ్చిన డైరెక్టర్ పరిస్థితులు చక్కదిద్ది, పాత మెస్ కాంట్రాక్టర్‌ను తొలగించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆహారం తయారీకి ఉపయోగించే వస్తువుల నాణ్యత, ఆహారం నాణ్యత, కిచెన్ పరిసరాల పరిశుభ్రత, ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల భద్రత తదితర అంశాల పరిశీలన, పర్యవేక్షణకు ప్రత్యేక వ్యవస్థ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆహారం తయారీ యంత్రాలు, తయారీలో వాడే వంట పాత్రలు అన్నీ కొత్తవి కొనుగోలు చేసి వాడాలని అధికారులను ఆదేశించారు. ట్రిపుల్ ఐటీలో సిబ్బంది నియామకంలో పోలీసు వారి సహకారంతో నేర చరిత్ర లేనివారిని నియమించాలని, ఫుడ్ కోర్ట్, ఇతర ఆహార తయారీ మెస్, స్నాక్స్ వంటి ఆహార పదార్థాలు మెప్మా, డ్వాక్రా గ్రూపుల సౌజన్యంతో పూర్తి నాణ్యతతో అందించే విషయాన్నీ పరిశీలించాలన్నారు. విద్యార్థులకు పూర్తి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సెలూన్, స్నాక్స్ షాపుల ఏర్పాటు, వాషింగ్ మిషన్ల సేవలు కూడా తక్కువ ధరకే అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయాలన్నారు. ఫుడ్ కమిటీలో విద్యార్థులను కూడా నియమించాలని ఆదేశించారు. ప్రభుత్వ, పారిశ్రామికవేత్తల, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ట్రిపుల్ ఐటీ విద్యాసంస్థను రాష్ట్రంలోనే ఒక మోడల్‌గా తీర్చిదిద్దాలని మంత్రి డైరెక్టర్ అమరేంద్రరావును ఆదేశించారు. కళాశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు రాజకీయాలకు తావులేకుండా పనిచేయాలని, రాజకీయం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సీసీ కెమెరాల ఏర్పాటు వంటి భద్రతాపరమైన ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. సమావేశంలో సిఎఒ బి.ప్రసాద్, ఎఒ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటి డైరెక్టర్ అమరేంద్రరావుతో మాట్లాడుతున్న మంత్రి పార్థసారధి

అప్పుల బాధతో ఆక్వా రైతు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - ముదినేపల్లి

అప్పుల బాధ భరించలేక ఆక్వా రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శుక్రవారం మండలంలోని శ్రీహరిపురం పంచాయతీ శివారు స్తంభం చెరువులో చోటుచేసుకుంది. స్తంభం చెరువు గ్రామానికి చెందిన రెడ్డి నాగరాజు చాలా కాలంగా రొయ్యల చెరువులు లీజుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. వైరస్ కారణంగా చెరువుల్లో నష్టాలు వచ్చాయి. దీంతో అప్పులు పెరిగిపోవడంతో ఇంటివద్దే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబీకులు వెంటనే గమనించి హుటాహుటీన గుడివాడలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. నాగరాజు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ప్రమాదమేమీ లేదని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగరాజును మీడియా పలుకరించగా ఇటీవల తనకు అప్పులు ఇచ్చిన వ్యక్తులు ఇంటికి వచ్చి వెంటనే చెల్లించాలంటూ ఒత్తిడి చేస్తున్నారన్నారు. దీంతో మనస్తాపానికి గురై చేసేదేమీ లేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు నాగరాజు చెప్పాడు.

సమర్థవంతంగా మద్యం పాలసీ అమలుకు కృషి

ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీలత

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రభుత్వ మద్యం పాలసీని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసేందుకు కృషి చేస్తానని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత తెలిపారు. శుక్రవారం స్థానిక శ్రీరామ్ నగర్‌లోని డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో ఆమె బాధ్యతలు చేపట్టారు. 2007లో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన శ్రీలత అనంతరం ఎక్సైజ్ సూపరింటెండెంట్, అసిస్టెంట్ కమిషనర్‌గా భీమవరం, అనంతపురం, విజయవాడల్లో పనిచేశారు. ప్రస్తుతం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డిప్యూటీ కమిషనర్‌గా పని చేస్తూ బదిలీపై ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా పశ్చిమగోదావరి జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ కెవి.నాగ ప్రభుకుమార్, డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ ఎ.ఆవులయ్య తదితరులు పుష్పగుచ్చాలు అందించి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని పలువురు ఎక్సైజ్ సిఐలు, ఇతర సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన నూతన మద్యం పాలసీపై ఇంకా నోటిఫికేషన్ రాలేదని, ఒకటి రెండు రోజుల్లో జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్ ఇచ్చిన అనంతరం టెండర్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని తెలిపారు. అక్టోబర్ మొదటి వారంలో డ్రా పద్ధతి ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు జరగవచ్చని అన్నారు.

విద్యార్థినిని వేధించిన ఉద్యోగిపై చర్యలు

అధికారులను ఆదేశించిన ఎపి ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని బూసరాజుపల్లి గిరిజన సంక్షేమ (గురుకులం) పాఠశాల, కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థినిని వేధిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఎపి ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు ఆదేశించారు. ఆ కళాశాలను ఆయన శుక్రవారం సందర్శించి వేధింపుల ఘటనపై కళాశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి, ఎటిడబ్ల్యూఒ శ్రీవిద్యను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత బాలికను పరామర్శించి, ధైర్యం చెప్పారు. కళాశాలలో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు. కెఆర్‌పురం ఐటిడిఎ ఇన్‌ఛార్జి డిప్యూటీ డైరెక్టర్ పివిఎస్ఎన్.నాయుడు కళాశాలను సందర్శించి విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.

మాట్లాడుతున్న బొరగం శ్రీనివాసులు

బాల్య వివాహాల నిరోధానికి ప్రజాప్రతినిధులు సహకరించాలి

మండల పరిషత్ సమావేశంలో ఎంపిడిఒ రాజ్‌మనోజ్

ప్రజాశక్తి - ఉంగుటూరు

బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రజాప్రతినిధులు అధికారులకు సహకరించాలని, చిన్నవయస్సులో పెళ్లిళ్ల వల్ల ఎన్నో అనర్థాలు జరుగుతాయని ఎంపిడిఒ జి.రాజ్‌మనోజ్ అన్నారు. ఉంగుటూరు ఎంపిపి గంటా శ్రీలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ కిశోర బాలికలకు వివాహాలు జరగకుండా తల్లిదండ్రులకు అంగన్‌వాడీలు, సూపర్‌వైజర్లే కాకుండా గ్రామ సర్పంచులు, ఎంపిటిసిలు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి హామీ పనుల గురించి ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదని పలువురు ప్రజాప్రతినిధులు తెలిపారు. ఉప్పాకపాడులో కాలువ గట్టు ఆక్రమణలు, కోతకు గురవుతున్నా మరమ్మతులు చేయడం లేదని, ఇలాగైతే రూ.30 లక్షలతో త్వరలో నిర్మించబోయే బిటి రోడ్డు ఎలా నాణ్యంగా ఉంటుందని ఉప్పాకపాడు ఎంపిటిసి సభ్యుడు మంగరాజు ప్రశ్నించారు. నాచుగుంటలో వెయ్యి మంది జాబ్ కార్డుదారులు ఉండగా మేట్‌లు ఐదుగురే ఉన్నారని, మేట్లను పెంచాలని సర్పంచి ఏలేటి సునీత కోరారు. దొంతవరం- కాగుపాడు రోడ్లుకు మరమ్మతులు చేయించరా అని దొంతవరం సర్పంచి కంభంపాటి సత్యవతి ప్రశ్నించారు. పిఆర్ ఎఇ కృష్ణమోహన్ మాట్లాడుతూ ఎంపీ ల్యాండ్స్ నిధులతో ఎనిమిది పనులు పూర్తి చేసేలా సర్పంచులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కాకర్లమూడి, తల్లాపురంలో అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవనాలను నిర్మించాలని ప్రజాప్రతినిధులు కోరారు. మండలంలో నాలుగు సంక్షేమ వసతి గృహాల భవనాలు శిథిలమై వర్షపు నీరు లీకవుతోందని, తాగునీటి ప్లాంటు, ఇన్వెర్టర్ సదుపాయాలను కల్పించాలని ఎఎస్‌డబ్ల్యూఒ కోరారు. నాచుగుంట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు పెట్టడం లేదని సర్పంచి సునీత అన్నారు. ఎంపిపి శ్రీలక్ష్మి మాట్లాడుతూ మండలంలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి పథకాలకు వచ్చిన నిధులతో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపిపి మేడవరపు ఈశ్వరి, జెడ్‌పిటిసి సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి, తహశీల్దారు బొడ్డేపల్లి దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ రాజ్‌మనోజ్

పెట్రోలియం స్టాండింగ్ కమిటీ సభ్యునిగా పుట్టా

ఏలూరు సిటీ: పెట్రోలియం సహజ వాయువు 2024-25 సంవత్సరానికి పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యునిగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ నియమితులయ్యారు. తనను స్టాండింగ్ కమిటీ సభ్యునిగా నియమించినందుకు మోడీకి, చంద్రబాబుకు ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు.

కష్టపడి కాదు.. ఇష్టపడి చదవాలి

ప్రజాశక్తి - భీమడోలు

విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తు కోసం కష్టపడి కాదు.. ఇష్టపడి చదవాలని ఎంఇఒ ఇ.శ్రీనివాసరావు కోరారు. స్థానిక మాధురి జూనియర్ కళాశాలలో శుక్రవారం కరస్పాండెంట్ కె.ప్రేమకుమార్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలతో కూడిన విద్యాంశాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ బాలు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి ఎంఇఒ మాట్లాడుతూ, విద్యార్థులు విద్యను అభ్యసించే సమయంలో ప్రాథమిక దశ నుంచి లక్ష్యాలను నిర్ణయించుకోవాలని, ఆ తర్వాత క్రమంలో లక్ష్యాలను ఛేదించడం పెద్ద కష్టం కాదని అన్నారు. మరొక అతిథి భీమడోలు గ్రంథపాలకులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు సెల్ సంస్కృతిని వీడి ఆ సమయం పుస్తక పఠనానికి కేటాయించాలని కోరారు. అందుబాటులో ఉన్న గ్రంథాలయాలకు వెళ్లి ఒక గంట సేపు పుస్తక పఠనం చేస్తే మంచి ఫలితాలు వస్తాయని సూచించారు. అనంతరం కరస్పాండెంట్‌తోపాటు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్, ఇతర అధ్యాపకులు మాట్లాడారు.

మాట్లాడుతున్న వక్తలు

రాష్ట్రస్థాయి పోటీలకు జెడ్‌పిహెచ్ విద్యార్థులు

ప్రజాశక్తి - భీమడోలు

గుండుగొలను శ్రీమావులేటి సోమరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదిమంది విద్యార్థులు జిల్లా జట్టు సభ్యులుగా రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనేందుకు అర్హత సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జికె డి.సునీత, పిడి వి.వెంకటేశ్వరరావు తెలిపారు. పెదవేగి, గురుకులం బాలికల పాఠశాల వేదికగా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 విభాగాలకు చెందిన సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీలను శుక్రవారం నిర్వహించారు. అక్టోబర్ నెలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా జట్టు తరుపున పాల్గొనే క్రీడాకారుల ఎంపికకు పోటీలను చేపట్టారు. ఈ పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచిన పాఠశాలకు చెందిన విద్యార్థులు గంటా అజయ్, పల్లెపు తేజ, బివి.మణికంఠ అండర్-17 బాలుర జట్టుకు, ఏకుల నాగదుర్గ, జంగం లక్ష్మీ ప్రసన్న అండర్-17 బాలికల జట్టుకు ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో బాలుర జట్టుకు బి.శశికాంత్, జి.కల్యాణ్‌బాబు, బాలికలు ఇళ్ల దుర్గాభవాని, ఎస్.వెంకట లలిత, డి.అనన్య రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టు సభ్యులుగా ఎంపికయ్యారు. గుండుగొలను హైస్కూల్లో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం తరపున పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వారిని అభినందించారు. వీరికి క్రీడల్లో శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్లు వి.వెంకటేశ్వరరావు, కృష్ణారావులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భీమడోలు : ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం

దెందులూరు : మండలంలోని కొవ్వలిలో జరుగుతున్న జిల్లాస్థాయి ఎంపికల రీజనింగ్‌లో జెడ్‌పిహెచ్ఎస్ మేదినరావుపాలెంలో చదువుతున్న ఏడుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 38 కేజీల విభాగంలో అండర్-14 ఫ్రీ స్టైల్ విభాగంలో వి.సాయిచంద్, అండర్-17 ఫ్రీ స్టైల్ విభాగంలో 45 కేజీల విభాగంలో ఎస్.శ్రీధర్, 48 కేజీల విభాగంలో టి.గణేష్, 55 కేజీల విభాగంలో పి.పవన్ కిషోర్, 80 కేజీల విభాగంలో ఆర్.శాంతి దీప్‌లు ఎన్నికయ్యారు. అండర్-17 గ్రీకో రోమన్ విభాగంలో 71 కేజీల విభాగంలో బి.రత్న బాలాజీ, 110 కేజీల విభాగంలో బి.హేమ వంశీకృష్ణలు ఎంపికయ్యారు. వీరు రాష్ట్రస్థాయిలో ఎంపికైన సందర్భంగా పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఎల్‌విడి.రవిబాబును, పాఠశాల విద్యార్థులను, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.హరి సీతారామయ్య అభినందించారు.

ముసునూరు : ఈనెల 25వ తేదీన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి కృష్ణాజిల్లా బాస్కెట్ బాల్ సెలక్షన్స్, శ్రీమాడపాటి వెంకటేశ్వరరావు విక్టోరియా టౌన్ హాల్ క్రీడా ప్రాంగణంలోని పోటీలలో రమణక్కపేట జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ అన్నారు. మండలంలోని విద్యార్థులు ఆరుగురు కృష్ణాజిల్లా జట్టుకు ఎంపికయ్యారు. అండర్-17 బాలికలు టి.నవ్య, డి.భార్గవి, బాలురు కె.మణికంఠ, అండర్ బి 14 బాలికలు టి.నాగ సుధ, జి.జెస్సీ, డి.ఇందు ప్రియలు ఎంపికయ్యారు. వీరు త్వరలో జరగబోయే అంతర్ జిల్లాల, రాష్ట్రస్థాయి పోటీలలో కృష్ణాజిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఉపాధ్యాయులు ఎ.శ్రీనివాస రావు, బి.కొండయ్య ఫిజికల్ డైరెక్టర్ వాకా నాగరాజుని, క్రీడాకారులను అభినందించారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

రాష్ట్రంలో మత విద్వేషాలను రెచ్చగొట్టొద్దు

సిపిఎం జిల్లా కార్యదర్శి రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డు సమస్యపై విచారణ చేసి, దోషులను కఠినంగా శిక్షించాలని, ప్రభుత్వం, ప్రతిపక్షం అంతవరకు సంయమనం పాటిస్తూ రాష్ట్రంలో మతవిద్వేషాలు రెచ్చగొట్టకుండా చూడాలని సిపిఎం జిల్లా కమిటీ కోరింది. ఈమేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి నేడు ఒక ప్రకటన విడుదల చేశారు. హిందువులు పవిత్రంగా భావించే తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ సమస్యపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ సమగ్ర విచారణ చేయాలని, దోషులను తెలపాలని, దోషులు ఎంతటి వారైనా వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. అంతవరకు లడ్డూ వ్యవహారాన్ని సాకుగా తీసుకొని బిజెపి ఆంధ్రాలో మతోన్మాదాన్ని పెంచడానికి, ప్రజలను రెచ్చగొట్టడానికి, తిరుపతి దేవస్థానాన్ని వారి అదుపులోకి తెచ్చుకోవడం కోసం వ్యూహాలు పన్నుతుందని ఆరోపించారు. ఇలాంటి సందర్భాల్లో ప్రభుత్వాలు సంయమనంతో వ్యవహరించి ప్రజల మధ్య ఐక్యతను కాపాడాల్సింది పోయి ప్రభుత్వంలో ఉన్నవారే ఈ మతోన్మాద చర్యలను ప్రోత్సహించడం బాధాకరమని అన్నారు. సాక్షాత్తు ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షలు, గుడిమెట్లు కడుగుతూ ఇతర మతాలపై మొత్తం నేరాన్ని మోపే విధంగా చేస్తున్నారని, సనాతన ధర్మాన్ని కాపాడుతామని ప్రకటనలు చేయడం చాలా బాధాకరమన్నారు. ఆ అంశంలోని లోపాలు గుర్తించి, దోషులను పట్టుకొని, వారిని కఠినంగా శిక్షించాల్సిన ప్రభుత్వాలు మతాన్ని, మతవిశ్వాసాలను రాజకీయాలకు వాడుకోరాదని హితవు పలికారు. వైసిపి నేతలు కూడా విమర్శలకు ప్రతి విమర్శలు చేస్తూ, ఇప్పుడు తిరుమల తిరుపతి దేవస్థానం దర్శనానికి వెళతామనడం, గుడిలో పూజలు చేయడం వంటి చర్యలు దేవున్ని రాజకీయాల్లోకి తీసుకువచ్చి రాష్ట్రంలో మతఘర్షణలను ప్రోత్సహించడమేనని అన్నారు. రాష్ట్రంలో ప్రజలు ఒకపక్క భారీవర్షాలతో, అధిక ధరలతో, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ అమ్ముతారనే ఆందోళనతో, నిరుద్యోగ సమస్యతో అనేక బాధలు పడుతుంటే ఈమొత్తం వ్యవహారాల్ని పక్కదారి పట్టించడం కోసం అధికార, ప్రతిపక్ష పార్టీలు వ్యవహరిస్తున్నాయని ఆయన విమర్శించారు. ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రభుత్వం ప్రజాసమస్యలపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. లౌకిక రాజ్యాంగంపై ప్రమాణం చేసిన ప్రజాప్రతినిధులు ఇలా తెగబడితే రాజ్యాంగాన్ని ఎవరు రక్షిస్తారని ప్రశ్నించారు. బిజెపి మతోన్మాద కుయుక్తుల్లో పడకుండా రాష్ట్రంలో లౌకికతత్వాన్ని, ప్రజల మధ్య ఐక్యతను కాపాడాలని కోరారు. తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ వ్యవహారంలో సమగ్ర విచారణ జరపడంతో పాటు, దోషులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

గిరిజనేతరుడిపై చర్యలు తీసుకోవాలి

ఆదివాసి గిరిజన సంఘం డిమాండ్

బుట్టాయగూడెం : గిరిజనుల సాగులో ఉన్న, పట్టాలున్న భూముల్లో వ్యవసాయం చేయనివ్వకుండా అడ్డుపడుతున్న గిరిజనేతరుడు దొడ్డి పూర్ణచంద్రరావుపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని చెంచుగూడెం గ్రామానికి చెందిన గిరిజనులు సాగుచేస్తున్న 4-76 సెంట్ల భూమిలో రాష్ట్ర ప్రభుత్వం 2004వ సంవత్సరంలో డి పట్టా, పాసుపుస్తకాలు ప్రస్తుతం అడంగులు వన్ బి నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ భూముల్లో గిరిజనేతరుడు దొడ్డ పూర్ణచంద్రరావు వ్యవసాయం చేయనివ్వకుండా అడ్డుపడుతున్నారన్నారు. రెండు సంవత్సరాల క్రితం గిరిజనులపై దాడి చేయడంతో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయటం కూడా జరిగిందని, అయినప్పటికీ అధికారులు మారినప్పుడల్లా ఫిర్యాదులు చేసి గిరిజనులను తీవ్రమైన ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. ఆయనపై తక్షణమే చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ డిమాండ్ చేశారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు తామ ముత్యాలమ్మ మాట్లాడుతూ గిరిజనులపై ఈ రకమైన వేధింపులు చేయటం గిరిజనేతరులకు పరిపాటిగా మారిందన్నారు. వెంటనే దిడ్డి పూర్ణ చంద్రరావుని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు దుర్గారావు ఉన్నారు.

గిరిజనులతో మాట్లాడుతున్న రామకృష్ణ, ముత్యాలమ్మ

ప్రజాశక్తి
www.prajasakti.com

తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపిపి కోర్స పోసమ్మ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి మండల జెడ్‌పిటిసి, పలువురు సర్పంచులు, ఎంపిటిసి కోరం సభ్యులు లేకుండా తూతూ మంత్రంగా కానిచ్చేశారు. దీనికి తోడు సమావేశపు హాలులో ఓపక్క వీడియో కాన్ఫరెన్స్ జరుగుతుండగా, మరోపక్క సర్వసభ్య సమావేశం జరుగుతుండటంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. వేరే మండలాలకు బదిలీలు అయిన కొన్ని శాఖల అధికారులు సమావేశానికి హాజరైన వారికి సమస్యలు చెప్పుకోవడానికి లేకుండా పోయిందని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండల అభివృద్ధిపై చర్చ లేకుండా సమావేశం ముగించేశారు.

పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు

తొలగించిన విద్యాకమిటీ ఛైర్మన్ యోహాన్

ప్రజాశక్తి - ముసునూరు

ముసునూరు పాఠశాలలో బాగా పెరిగిపోయిన పిచ్చి మొక్కలలో పాములు సంచరించడం వల్ల విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయం గమనించిన పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ నక్క యోహాన్ తన సొంత ఖర్చులతో పిచ్చి మొక్కలను తొలగించడానికి ట్రాక్టర్‌తో డిస్క్ వేయించి పాఠశాలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా గ్రామ ఉపసర్పంచి తోట శ్రీనివాసరావు, గ్రామస్తులు కె.ఉదయ్ కిరణ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎపిఎంగా రాజశేఖర్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల వెలుగు ఎపిఎంగా దయాల రాజశేఖర్ శుక్రవారం నాడు బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన నూజివీడు నుంచి ఆగిరిపల్లికి బదిలీ కాగా ఆగిరిపల్లిలో పనిచేస్తున్న బోలగాని రామకృష్ణ రెడ్డిగూడెం మండలానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల పనితీరు మెరుగుపర్చటంతో పాటు లింకేజీ, స్త్రీనిధి రుణాల రికవరీకి చర్యలు చేపట్టడం, ఎప్పటికప్పుడు విఒఎల పనితీరును పర్యవేక్షిచటం జరుగుతుందన్నారు.

పంచాయతీరాజ్ డిఇగా వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - మండవల్లి

పంచాయతీరాజ్ శాఖ మండవల్లి సబ్ డివిజన్ నూతన డిఇగా బండారు వెంకటేశ్వరరావు శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన బదిలీలలో భాగంగా అవనిగడ్డ సబ్ డివిజన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఈయనను మండవల్లికి బదిలీ చేశారు. దీంతో ఆయన ఉద్యోగ బాధ్యతలను చేపట్టారు. ఇంతకుముందు మండవల్లి పంచాయతీరాజ్ శాఖ సబ్ డివిజన్ డిఇగా పనిచేసిన పగడాల సురేష్ అవనిగడ్డ బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా డిఇ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇంతకుముందు పంచాయతీరాజ్ శాఖ మండవల్లి సబ్ డివిజన్ పరిధిలో ఎఇగా విధులు నిర్వహించడం జరిగిందని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ డిఇగా బదిలీపై మండవల్లికే రావడం సంతోషంగా ఉందన్నారు. విధులను సక్రంగా నిర్వహించి పంచాయతీల అభివృద్ధికి కృషిచేస్తానని ఆయన తెలిపారు.

చిరు వ్యాపారులకు నూతన ప్లాట్‌ఫామ్

ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు ఓల్డ్ ఫిష్ మార్కెట్‌లో వ్యాపారాలు కొనసాగించే చిరు వ్యాపారులకు త్వరలోనే నూతన ఫ్లాట్ ఫామ్స్ అందుబాటులోకి తీసుకువస్తానని ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. స్థానిక వ్యాపారులంతా రోడ్లపై కాకుండా నిర్ధేశిత స్థలాల్లో స్వేచ్ఛాయుత వాతావరణంలో అమ్మకాలు సాగించవచ్చని సూచించారు. ఏలూరు ఓల్డ్ ఫిష్ మార్కెట్‌కు చెందిన పలువురు వ్యాపారులు ఇటీవల ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయానికి చేరుకుని తమ సమస్యలను ఎంఎల్ఎ చంటికి విన్నవించారు. వాటిపై ప్రత్యేక దృష్టిసారించిన ఎంఎల్ఎ బడేటి చంటి తాజాగా ఆయా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు స్థానిక 6వ డివిజన్‌లోని ఓల్డ్ ఫిష్ మార్కెట్‌కు శుక్రవారం చేరుకున్నారు. ఆయా వ్యాపార స్థలాలను సందర్శించారు. వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ స్థానిక వ్యాపారులు స్వేచ్ఛాయుత వాతావరణంలో వ్యాపారాలు సాగించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నామన్నారు. ఇందులో భాగంగానే మార్కెట్ బయట రోడ్లపై వ్యాపారాలు సాగించే స్థానికులకు త్వరలో న్యూ ఫ్లాట్ ఫాం నిర్మిస్తామని అన్నారు. చిరువ్యాపారుల ఉపాధికి కూటమి ప్రభుత్వం నూతన బాటలు వేస్తోందన్నారు. ఇందుకు ప్రత్యేక సదుపాయాలు సైతం కల్పిస్తామని వెల్లడించారు. అదేవిధంగా మార్కెట్ ప్రాంతంలో రెండు మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. అలాగే మార్కెట్ ప్రాంతంలో వీధి దీపాల ఏర్పాటుకు సంబంధించి ఎలక్ట్రికల్ ఎఇతో మాట్లాడానని, ఆ సమస్య కూడా పరిష్కారమవుతుందని ఎంఎల్ఎ చంటి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, టిడిపి నాయకులు కొట్టు మనోజ్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

కొల్లేరును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు

ప్రజాశక్తి - మండవల్లి

వలస పక్షుల విన్యాసాలతో పరవశింపజేసే కొల్లేరు సరస్సును పర్యాటకంగా తీర్చిదిద్దితే రాష్ట్రానికి ఆదాయంతో పాటు ఎంతోమందికి ఉపాధి లభిస్తుందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు స్పష్టం చేశారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం కొల్లేరును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని ఫ్లాట్ కార్డులతో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొల్లేరును పర్యాటకంగా అభివృద్ధి చేస్తేనే కొల్లేరు పరిసర ప్రాంత లక్షలాది మంది ప్రజల అభివృద్ధి సాధ్యపడుతుందని అన్నారు. ఆటపాక పక్షుల కేంద్రాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి దూర ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకుల కోసం కాటేజీలు నిర్మించాలని, వలస పక్షుల సంఖ్య పెంచేందుకు తగిన వసతులు సమకూర్చాలన్నారు. చెరువుగట్లను అభివృద్ధి చేసి సంవత్సరం పొడుగు నీరు నిల్వ ఉండేలా చూసి బోటు షికారులను సంవత్సరం పొడుగునా నిర్వహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల అధ్యక్షులు అప్పారావు పాల్గొన్నారు.

యర్రగుంటపల్లిలో పోలీసుల పల్లెనిద్ర

చింతలపూడి : సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన నేపథ్యంలో ప్రతి ఒక్కరికీ ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాలను వినియోగించే క్రమంలో కొంత మంది సైబర్ నేరగాళ్లు ప్రజల అవగాహనా లోపం వల్ల సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు జంగారెడ్డిగూడెం డిఎస్‌పి రవీంద్ర అన్నారు. జంగారెడ్డిగూడెం డిఎస్‌పి రవీంద్ర, చింతలపూడి సిఐ రవీంద్ర, చింతలపూడి ఎస్ఐ కుటుంబరావు, ఇతర శాఖల అధికారులతో కలిసి మండలంలో ఉన్న యర్రగుంటపల్లి గ్రామంలో పల్లె నిద్రను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు గ్రామస్తులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకుల నుంచి ఒక మెసేజ్‌ని మనకు పంపించి మీ అకౌంట్లో ఉన్నటువంటి ఆధార్ కార్డును త్వరగా అప్డేట్ చేయాలని, సదరు ఆధార్ కార్డు అప్డేట్ చేయడానికి వారు పంపించినటువంటి లింక్‌ను ఉపయోగించాలని ప్రజలను ఒత్తిడి తీసుకువస్తున్నట్లు తెలిపారు. అటువంటి సందర్భాలలో ప్రజలకు అసలు ఆ సదరు బ్యాంకులో అకౌంట్ ఉందా లేదా అని గ్రహించాలని, ఎటువంటి మెసేజ్లను బ్యాంకులో నుంచి మనకు పంపరని ముందుగా గ్రహించాలని అన్నారు. అతి పెద్ద కంపెనీలు నిర్వహించిన డ్రాలో మీకు బహుమతి వచ్చినట్లు, దానిని పొందాలంటే మీ బ్యాంక్ అకౌంట్ లేదా మీకు సంబంధించినటువంటి ఒటిపి వస్తుంది దాన్ని తెలియచేసిన ఎడల మీకు పెద్ద బహుమతి వస్తుందని ఆశ చూపించి పంపించే మెసేజ్లు పట్ల ఆకర్షితులు అయితే మీ బ్యాంక్ లో ఉన్నటువంటి డబ్బులు, మీ విలువైన సమాచారం అంతా కూడా సైబర్ నేరగాళ్లు తస్కరిస్తారని తెలిపారు. అటువంటి మెసేజ్‌లు పేడితే వెంటనే సైబర్ నేరాలు అన్వేషించే 1930కు తెలియచేయాలని తెలిపారు. ప్రజలు ఆపద సమయాలలో 112కు ఫోన్ చేసిన ఎడల సుమారు 15 నుంచి 20 నిమిషాల వ్యవధిలో పోలీసు వారు సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు.

ప్రమాదవశాత్తూ వ్యక్తి మృతి

దెందులూరు : మండలంలోని చల్ల చింతలపూడి గ్రామంలో వినాయక విగ్రహం ఊరేగింపులో సింహాద్రి అయ్యప్ప(28) ప్రమాదవశాత్తు మృతిచెందాడు. చెరువులో రాత్రి సమయంలో వినాయకున్ని నిమజ్జనం చేస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెందాడు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ప్రతి ఇంటికీ తాగు నీరందించడమే లక్ష్యం

ఓవర్‌హెడ్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు

ప్రజాశక్తి - భీమడోలు

శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ ధర్మరాజు

జల జీవన్ మిషన్ నిధులతో ఇంటింటికీ కు ళాయి పథకంలో భాగంగా ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషిచేస్తుందని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు తెలిపారు. ఆయన భీమడోలు మండలంలో శుక్రవారం పర్యటించారు. దీనిలో భాగంగా గుండుగొలను గృహనిర్మాణ సంస్థ కాలనీలో నిర్మించిన సుమారు 900 గృహాల అవసరాల కోసం రూ.1.59 కోట్ల జలజీవన్ మిషన్ నిధులతో 1.20 లక్షల లీటర్ల సామర్థ్యంతో నిర్మించనున్న ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దీనికి అనుబంధంగా భూగర్భ జలాలు అందించే బోర్‌ను ఏర్పాటు చేయనున్నారు. గోదావరి జిల్లాలో తాగునీటిని అందించేందుకు నీటి నిల్వ కోసం ప్రత్యేక సంపు ఏర్పాటుకు ప్రతిపాదనలను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా స్థానికులు నూతనంగా ఏర్పడిన కాలనీలో జనాభా మరింతగా పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రస్తుతం నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు సామర్థ్యాన్ని 1.20 లక్షల లీటర్ల నుంచి 1.50 లక్షల లీటర్లకు పెంచాలని కోరారు. నూతనంగా ఏర్పడిన కాలనీకి రోడ్లు ఏర్పాటు చేయడంతో పాటు, మురుగునీటి పారుదల వ్యవస్థను క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదేవిధంగా ప్రస్తుతం ఏర్పడిన కాలనీ దాదాపుగా గ్రామపంచాయతీకి అదనపు ఆవాస ప్రాంతంగా ఏర్పడిన నేపథ్యంలో ఏలూరు కాలువపై ఆ ప్రాంతంలో వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎంఎల్ఎను కోరారు.

భీమడోలులో ఏలూరు కాలువ సమీపంలోని గృహ నిర్మాణ సంస్థ కాలనీలో 154 గృహాలకు ఇంటింటి కుళాయి పథకంలో భాగంగా తాగునీరు అందించేందుకు సుమారు రూ.57 లక్షల వ్యయంతో 60 వేల లీటర్ల సామర్థ్యం గల ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణానికి ఎంఎల్ఎ ధర్మరాజు శంకుస్థాపన చేశారు. ఆ ప్రాంతవాసులు కాలనీలో రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎంఎల్ఎను కోరారు. దీనిపై స్పందించిన ఎంఎల్ఎ మాట్లాడుతూ గుండుగొలను, భీమడోలు గృహనిర్మాణ సంస్థ కాలనీలలో రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయని, ఇతర పనులను ప్రాధాన్యత రీత్యా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులు పూర్తిచేయాలి

ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

సీసీ రోడ్లు, డ్రెయిన్స్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ సొంగ రోషన్‌కుమార్ అన్నారు. చింతలపూడి ఎంఎల్ఎ కార్యాలయం వద్ద శుక్రవారం కామవరపుకోట మండలం ఎన్ఆర్ఇజిఎస్ కాంట్రాక్టర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని, నియోజకవర్గంలో రోడ్లకు మహర్దశ వచ్చిందని అన్నారు. ప్రజలను దృష్టిలో పెట్టుకొని రోడ్లు, డ్రెయిన్స్ నిర్మాణ పనులు పారదర్శకంగా జరగాలని అన్నారు. సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణ విషయంపై పలు సూచనలు చేశారు. రోడ్లు నాణ్యతగా ఉండాలని, ఎలాంటి అక్రమాలకు పాల్పడకుండా ప్రజల శ్రేయస్సును కాంట్రాక్టర్స్ దృష్టిలో పెట్టుకొని పనులు వేగవంతంగా, నాణ్యతగా జరిగేటట్లు చూసే బాధ్యత మీపై కూడా ఉందని పేర్కొన్నారు.

నేడు నియోజకవర్గ అథ్లెటిక్స్ పోటీలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఈనెల 28న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే అథ్లెటిక్ పోటీలకు నూజివీడు నియోజకవర్గంలోని ముసునూరు, నూజివీడు, ఆగిరిపల్లి, చాట్రాయి మండల అథ్లెటిక్స్ క్రీడాకారులు పాల్గొంటారని బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వివిఎస్.సత్యన్నారాయణ తెలిపారు. అండర్-14, అండర్-17 బాల బాలికలకు డిఆర్ కాలేజీ నూజివీడులో జరుగుతాయన్నారు. రన్నింగ్, లాంగ్ జంప్, హైజంప్, జావిలిన్, డిస్కస్, ట్రిపుల్ జంప్, రిలేస్, హ్యామర్ త్రోలో సెలక్షన్స్ జరుగుతాయని తెలిపారు. క్రీడాకారులుకు మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేశామని తెలిపారు. క్రీడాకారులు జూనియర్ విభాగంలో 1-1-2011 తరువాత జన్మించినవారై ఉండాలన్నారు. సీనియర్ విభాగంలో1-1-2008 తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. శుక్రవారం నియోజకవర్గ వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు సమావేశమై శనివారం స్పోర్ట్స్ కార్యక్రమం గూర్చి చర్చించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాయామ ఉపాధ్యాయులు రాణి, సరళ, నాగరాజు, రవీంద్ర, సుగుణ రావు, నాగేశ్వరరావు, రాజేంద్రప్రసాద్, ప్రభాకర్, ఆరతి పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులు బదిలీ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

సాధారణ బదిలీల్లో భాగంగా నలుగురు పంచాయితీ కార్యదర్శులు మండలం నుంచి ఇతర మండలాలకు బదిలీ అయినట్లుగా ఇన్‌ఛార్జి ఎంపిడిఒ షేక్ అబ్దుల్ సలాం తెలిపారు. వట్టిగుడిపాడు పంచాయతీ కార్యదర్శి షేక్ మీర్జావలి జుజ్జూరు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా, నూగొండపల్లి పంచాయతీ కార్యదర్శి సిహెచ్.పుల్లారావు మోపర్రు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా, అడవినెక్కలం పంచాయతీ కార్యదర్శి మల్లెల శ్రీనివాసరావు బొమ్మినంపాడు పంచాయతీ కార్యదర్శిగా, కలటూరు పంచాయతీ కార్యదర్శి నక్కనబోయిన కృష్ణవేణి జమిదింటకుర్రు పంచాయతీ కార్యదర్శిగా బదిలీ అయినట్లుగా తెలిపారు. వీరిని అక్టోబర్ రెండవ తేదీ తర్వాత రిలీవ్ చేయడం జరుగుతుందని అన్నారు.

పెద పాలేరులా పనిచేస్తా : మంత్రి

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని తుమ్మగూడెం, కొత్తగూడెం, మర్లపాలెం గ్రామాలలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పార్థసారధి మాట్లాడుతూ ప్రజల కోసం పెద పాలేరులా పనిచేస్తానన్నారు. రాష్ట్రం అప్పులలో ఉన్నా కూడా మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పినట్లు పెన్షన్ రూ.3 వేల నుంచి రూ.4 వేలకు ఒకేసారి పెంచి ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వటం జరుగుతుందని, రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. అనంతరం తుమ్మగూడెం గ్రామంలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి అధికార ప్రతినిధి మందపాటి బసవా రెడ్డి, జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

టి.నరసాపురం: విద్యార్థులు విద్యతో పాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ ఎం.జయబాబు సూచించారు. మండలంలోని బొర్రంపాలెం జెడ్‌పి హైస్కూల్లో శుక్రవారం పోలీసులు బాలబాలికలకు పోక్సో, పలు చట్టాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైనా ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండడం ద్వారా కొన్ని నేరాలను అదుపు చేయవచ్చన్నారు. ఎఎస్ఐ వి.విజయ్ కుమార్ ఉన్నారు.

రైతుల సహకారంతోనే సహకార సంఘాల అభివృద్ధి

ప్రజాశక్తి - టి.నరసాపురం

రైతుల సహకారంతోనే సహకార సంఘాలు అభివృద్ధి సాధిస్తాయని మాజీ జెడ్‌పిటిసి సభ్యులు నల్లూరి వెంకట చలపతిరావు అన్నారు. మండలంలోని కె.జగ్గవరం సహకార సంఘం మహాజన సభ శుక్రవారం ఇన్‌ఛార్జి ఛైర్‌పర్సన్ టి.లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సిఇఒ తనగాల వీరవెంకయ్య సహకార సంఘం వ్యాపారాలు, లాభనష్టాలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించినప్పుడే సంఘం ఆర్థికాభివృద్ధి చెందుతుందన్నారు. సంఘం నిర్వహిస్తున్న వ్యాపారాలు రైతులకు సౌకర్యవంతంగా ఉండేలా చూడాలన్నారు. ఎరువుల విక్రయాల విషయంలో రైతులకు పారదర్శకంగా బిల్లులు ఇవ్వాలని సూచించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ మాజీ అధ్యక్షులు, ఛైర్మన్ డైరెక్టర్‌ల సహకారంతో సంఘ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సంఘం అందిస్తున్న సేవలు రైతులు వినియోగించుకోవాలన్నారు. మాజీ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి మధు, బొంతు సత్యనారాయణ, వెలిది నాగబాబు, లింగారెడ్డి శ్రీను, గంటా సతీష్, నార్ని వెంకట్రావు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

సిఐటియు మండల కార్యదర్శి సాయికిరణ్

ప్రజాశక్తి - కుక్కునూరు

కార్మికులకు ఉరి తాడుగా మారే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రభుత్వాని డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో సిఐటియు జనరల్ బాడీ సమావేశం పోచారపు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఎన్నికల్లో మెజార్టీ కోల్పోయినప్పటికీ కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను అమలు చేస్తామని చెప్పి, కార్మికులకు ద్రోహం చేస్తుందని విమర్శించారు. 29 కార్మిక చట్టాలను, వేతనాల కోడ్ 2019, వృత్తిపర రక్షణ, ఆరోగ్యం, వర్కింగ్ కండిషన్ల కోడ్, పారిశ్రామిక సంబంధాల కోడ్, సామాజిక భద్రతా కోడ్లు అనే నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికులకు తీరని అన్యాయం కేంద్రం ప్రభుత్వం చేస్తుందని అన్నారు. చాలిచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్న స్కీం వర్కర్లను పారిశ్రామిక సంబంధాల కోడ్‌తో సహా మిగతా మూడు కోడ్లలో కూడా వర్కర్స్ గుర్తించబడలేదన్నారు. ఈ 4 కోడ్లు కూడా వీరికి వర్తించవని, ఈ కోడ్‌లు ఉన్న కొద్దిపాటి హక్కులను కూడా ఎప్పుడు కావాలంటే అప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నోటిఫికేషన్ ద్వారా తాము అనుకున్నంత కాలంపాటు నిలిపివేసే హక్కు వచ్చిందన్నారు. కోర్టులు కూడా ఏమి చేయలేని పరిస్థితి వస్తుందని, ఏ మార్పులనైనా సరే చట్టసభలకు వెళ్లకుండా, కార్మిక సంఘాలతో చర్చించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయవచ్చు అన్నారు. కార్మికుల సంక్షేమం మర్చిపోయి పెట్టుబడిదారీ వ్యవస్థ, కార్పొరేట్ వ్యవస్థకు ప్రభుత్వం వత్తాసు పలుకుతూ శ్రామికవర్గానికి తీరని అన్యాయం చేస్తుందని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేసి, కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. కనీస వేతనాలు అమలు చేయాలని, లేదంటే కార్మికులను ఐక్యం చేసి పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కోశాధికారి బాడిస సుజాత, సహాయ కార్యదర్శి కాకర్ల శ్రీను, సభ్యులు శ్రావణి, గ్రేసి, పద్మ, దుర్గమ్మ, రమణ, భవాని, బాపనమ్మ, చందు, ఇరకం శ్రీను పాల్గొన్నారు.

విద్యార్థులు ఆటల్లోనూ రాణించాలి

ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్

ప్రజాశక్తి - మండవల్లి

విద్యార్థులు పోటీతత్వాన్ని పెంపొందించుకొని ఆటల్లో, విద్యలో రాణించాలని ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్ స్పష్టం చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడాపోటీలను శుక్రవారం ఆయన రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలు విద్యార్థి ఎదుగుదలతో పాటు మానసిక, శారీరక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడతాయని అన్నారు. అంతేకాకుండా ఆటలతో మేధస్సుతోపాటు జ్ఞాపకశక్తి పెరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ఆటలలో మంచి నైపుణ్యాన్ని కనబరిచి, గెలుపొంది జిల్లాస్థాయి నుంచి జాతీయస్థాయి ఆటల పోటీలలో పాల్గొని విజేతలుగా నిలవాలని, తద్వారా పాఠశాలకు, గ్రామానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకటరమణ, ఎంఇఒ 2 రత్న సునాదం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, ఆటల పోటీల ఇన్‌ఛార్జి వేణుబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ముసునూరు: స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో నిర్వహించిన గేమ్స్‌లో తమ పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి ఆటలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జిఎస్ఎల్ నిర్మలాదేవి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గుడిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న తమ పాఠశాలలోని ఐదుగురు విద్యార్థులు కబడీ, వాలీబాల్ ఆటల పోటీలకు ఎంపికైనట్లు తెలియజేశారు. తమ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులు లేనప్పటికీ తమ విద్యార్థులు స్వశక్తితో తమ ప్రతిభను చాటారన్నారు.

వేల్పుచర్ల విద్యార్థుల ప్రతిభ

స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో నిర్వహించిన డివిజన్ స్థాయి ఆటల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని వేల్పుచర్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని వేల్పుచర్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న తమ విద్యార్థులు వాలీబాల్, కోకో ఆటల్లో జిల్లాస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఆ విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు బి.సుకుమార్‌ను అభినందించారు.

మున్సిపల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి

ఏలూరు అర్బన్ : మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై గతంలో అనేకసార్లు ప్రాతినిధ్యం చేసినప్పటికీ పరిష్కారానికి నోచుకోని కారణంగా మున్సిపల్ టీచర్ల ఆందోళన రోజురోజుకీ తీవ్రమవుతుంది. ఈ నేపథ్యంలో వారి డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ కార్యక్రమం చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర సంఘం నిర్ణయించిన నేపథ్యంలో శుక్రవారం సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా విద్యాశాఖ అధికారికి యుటిఎఫ్ జిల్లా కమిటీ పక్షాన వినతిని అందజేశారు. మున్సిపల్ హైస్కూల్లో తగినంత మంది సబ్జెక్ట్ టీచర్లను నియమించే విధంగా ఎస్‌జిటి పండిట్ పిఇటి పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని, నవంబర్‌లోగా అప్‌గ్రేడ్ పోస్టులలో మున్సిపల్ టీచర్లకు ప్రమోషన్ ఇవ్వాలని, మున్సిపల్ ప్రధానోపాధ్యాయులలో అర్హులైన వారిని అర్బన్ ఎంఇఒగా నియమించాలని అన్నారు. మున్సిపల్ టీచర్ల బదిలీలు వెంటనే చేపట్టాలని కోరుతూ జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర సంఘం ఇచ్చిన కార్యాచరణలో భాగంగా ఈనెల 2వ తేదీన గాంధీ జయంతి రోజున ఏలూరు కార్పొరేషన్ పరిధిలో సత్యాగ్రహ దీక్ష చేయడం జరుగుతుందని, ఈనెల 17వ తేదీన డిఇఒ కార్యాలయం వద్ద సత్యాగ్రహ దీక్ష చేయడం జరుగుతుందన్నారు. అయినప్పటికీ సమస్యలు పరిష్కరించని పక్షంలో ఈనెల 24వ తేదీన డైరెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని అన్నారు.

క్షతగాత్రులకు వైద్య సేవలందజేత

మానవత్వం చాటుకున్న మంత్రి పార్థసారథి

నూజివీడు టౌన్: చాట్రాయి మండలంలో పర్యటన నిమిత్తం శుక్రవారం నూజివీడులో మంత్రి కార్యాలయంనకు వస్తున్న రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తుక్కులూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం చూసి వెంటనే స్పందించారు. ఆయన స్వయంగా తన వాహనం దిగి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మెర్సీపూడికి చెందిన కె.సాల్వే అనే మహిళను హుటాహుటిన ప్రత్యేక వాహనంలో నూజివీడు ఏరియా ఆసుపత్రి పంపించారు. అనంతరం నూజివీడు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర సింగ్‌కు ఫోన్ చేసి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళను ఏరియా ఆసుపత్రికి పంపిస్తున్నామని, సదరు మహిళ ప్రాణాపాయం నుంచి కాపాడి మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. మహిళ ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తనకి తెలియజేయాలని మంత్రి డాక్టర్ నరేంద్ర సింగ్‌కు చెప్పారు. గాయపడిన మహిళను ఆసుపత్రికి పంపించే సమయంలో మంత్రి పడిన తపన, వైద్యాధికారికి ఫోన్ చేసి ఆదేశించిన తీరును అక్కడి ప్రజలు గమనించి మానవత్వంతో పాటు ప్రజాసేవకుడి అనే మాటకు అర్థాన్ని చూపిన మంత్రి పార్థసారథి అని కొనియాడారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ముసునూరు: ప్రభుత్వ, ప్రయివేటు హైస్కూల్ స్థాయి విద్యార్థులకు ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విజన్ స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమంపై వ్యాసరచన, వక్తృత్వం, డిబెట్ నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారి బివిఎస్.సుబ్బారావు పేర్కొన్నారు. శుక్రవారం మండలకేంద్రమైన ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమంపై వ్యాసరచన పోటీలో ప్రథమ స్థానంలో సిహెచ్.సాయి వర్షిణి, ఎపిఆర్ఎస్ ముసునూరు, ద్వితీయ స్థానం పి.లాస్య చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ చెక్కపల్లి, వక్తృత్వం పోటీల్లో ప్రథమస్థానం ఎం.పూజిత చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్, ద్వితీయ స్థానం టి.సాహితీ ఎపి గురుకుల పాఠశాల ముసునూరు గెలుపొందారు. డిబేటింగ్ పోటీలో ప్రథమ స్థానం కె.నాగసత్యమానస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాట్రేనిపాడు, ద్వితీయ స్థానం ఎం.పూజిత చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ చెక్కపల్లి, మండలస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో వచ్చినట్లు ఆయన తెలియజేశారు.

భీమడోలు : స్వర్ణాంధ్ర ఎ 2047లో భాగంగా భీమడోలు మండల స్థాయిలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్వర్ణాంధ్ర సాధించుటకు రాబోయే ఐదు సంవత్సరాలలో విద్యారంగంలో తీసుకురావలసిన సంస్కరణలపై నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన, చర్చాగోష్టి కార్యక్రమాలలో భీమడోలు హై స్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని మండల విద్యాధికారి భాస్కర్ కుమార్ తెలిపారు. భీమడోలు మండలస్థాయి పోటీలను భీమడోలు హైస్కూల్ వేదికగా శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు నిర్వహించగా సిఆర్ఎంటిలు సత్య ప్రసాద్, రమణ సహకరించారు. వ్యాసరచన పోటీలలో ఎల్.యశస్విని, వక్తృత్వ పోటీలలో వి.వెంకట దుర్గారావు(భీమడోలు) చర్చాగోష్టి కార్యక్రమంలో సిహెచ్.నాగ వెంకట దుర్గారావు(గుండుగొలను) ప్రథమ స్థానం దక్కించుకున్నారని మండల విద్యాధికారి తెలిపారు. వీరు శనివారం ఏలూరులో నిర్వహించే జిల్లాస్థాయి పోటీలకు హాజరుకానున్నారని చెప్పారు.

ముఖ్యమంత్రికి చెక్కు అందజేస్తున్న ఎంఎల్ఎ

వరద బాధితులకు చేయూత

ప్రజాశక్తి - ఉంగుటూరు

విజయవాడ వరద బాధితుల కోసం ప్రజలు, వ్యాపారస్తులు, నాయకుల నుంచి సేకరించిన విరాళాలు రూ.84,83,293 చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబుకు శుక్రవారం ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అందజేశారు. ఈ సందర్భంగా ఉంగుటూరు నియోజకవర్గ ప్రజలను సిఎం అభినందించారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

రక్తహీనత వున్న తల్లులు ఐరన్ నిల్వలు అధికంగా వుండే ఆహారపదార్థాలు తీసుకునేలా అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించాలని ఆగిరిపల్లి సర్పంచి చవటపల్లి లక్ష్మీ విక్టర్‌బాబు కోరారు. శుక్రవారం ఆగిరిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాల సందర్భంగా నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేతులు శుభ్రపర్చుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత, రక్తహీనత నివారణకు తీసుకోవలసిన ఆహారపదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ఆగిరిపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ జి.రాగమయి, తల్లులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'మాదక ద్రవ్యాల నియంత్రణ ముఖ్యం'

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

సమాజ శ్రేయస్సుకు మాదక ద్రవ్యాల నియంత్రణ ఎంతో ముఖ్యమని, యువత ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసే మాదక ద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా రూపుమాపేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గొల్లమూడి శేఖర్‌బాబు అన్నారు. ఆగిరిపల్లిలోని అంగన్‌వాడీ సెంటర్‌లో నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మత్తు పదార్థాలు, సోషల్ మీడియా దుర్వినియోగం అనే అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఆగిరిపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ జి.రాగమయి, నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో-ఆర్డినేటర్ డి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వివిధ అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ అధ్యక్షతన శుక్రవారం సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ అభివృద్ధి పనులకు గాను రూ.16 కోట్లతో ఆమోదం తెలిపారు. పట్టణ పరిధిలోని చెరువుల వద్ద గండి పడిన ప్రాంతాలలో నీరు ఇప్పటికే ప్రవహిస్తూ ఉండడంతో వాహన చోదకులకు ఎంతో ఇబ్బంది కలుగుతున్న నేపథ్యంలో డ్రెయినేజీలకు దారి మళ్లించాలని కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ కొమ్మ వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ పగడాల సత్యనారాయణ, టిడిపి ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, కౌన్సిల్ సభ్యులు, పురపాలక సంఘ అధికారులు పాల్గొన్నారు.

NOTICE

In The Court Of The Senior Civil Judge (Senior Division) Tadepalligudem

O.S.No. 10/2023

Between:
Chilla Varalakshmi ...Plaintiff
AND
Perumalla Venkata Phanindra Kumar ...Defendant

TO: Defendant:
Perumalla Venkata Phanindra Kumar, S/o. Venkata Vijaya Raghava Rao, Age 45 Years, Hindu, Male, Business, D.No.9-76/1, Nethalavari Veedhi, Ganapavaram Mandal, W.G.Dist., TPG PJCJC-534198.

Please take notice that the above suit was filed by the plaintiffs againsty the defendants. The matter is posted for the appearance of the above defendant **on 23-12-2024 from 10:30 A.M. onwards,** on which day you may appear in person or through your advocate and file your objections /pleadings if any. Otherwise the matter will be adjudicate according to law in your absence.

G.SYAMA PRASAD MUKHERJEE
N.SURYA MANI
Tadepalligudem, Advocates,
17-9-24. Tadepalligudem.

SUIT SUMMONS

In The Court Of The 1st Addl. Civil Judge (Junior Division) Tadepalligudem

O.S.No. 404/2023

Between:
1) Dandu Naga Saraswathamma @ Saraswathi
2) Dandu Siva Subramanya Lachi Raju ...Plaintiffs
AND
1) Kalidindi Vijaya Kumar Raju
2) Kalidindi Sai Sudha Rani ...Defendants

TO: 2nd Defendant:
Kalidindi Sai Sudha Rani, W/o. Kalidindi Vijaya Kumar Raju, Aged 60 Years, Hindu, Male, Cultivation, Flat No.101, B-Block, Swarnarama Towers, D.No.6-95/1, Rayalam, Bhimavaram Mandal, W.G.Dist., BVRM PJCJC.

Please take notice that the above suit was filed by the plaintiffs againsty the defendants which is posted for the appearance of the above 2nd defendant **on 18-10-2024 from 10:30 A.M. onwards,** on which day you may appear in person or through your advocate and file your objections /pleadings if any. Otherwise the matter will be adjudicate according to law in your absence.

G.SYAMA PRASAD MUKHERJEE
N.SURYA MANI
Tadepalligudem, Advocates,
15-9-24. Tadepalligudem.